రోడ్ షోలో ప్రజలనుద్దేశించి మాట్లాడుతున్న మాజీమంత్రి హరీశ్‌రావు

ఐదు నెలల్లో ఐదేండ్లు వెనక్కి

మోసపూరిత కాంగ్రెస్‌కు బుద్ధిచెప్పాలే • గత పదేండ్లలో 50 ఏండ్ల అభివృద్ధి

పార్లమెంట్‌లో రాష్ట్ర గొంతుక బీఆర్‌ఎస్ మాజీ మంత్రి, ఎమ్మెల్యే హరీశ్‌రావు

గజ్వేల్/సిద్దిపేట అర్బన్, మే 11: పదేండ్లలో కేసీఆర్ 50 ఏండ్ల అభివృద్ధి చూపిస్తే..ఐదు నెలల్లోనే కాంగ్రెస్ పార్టీ రాష్ర్టాన్ని ఐదేండ్లు వెనక్కి తీసుకుపోయిందని మాజీ మంత్రి, ఎమ్మెల్యే హరీశ్‌రావు విమర్శించారు. వంద రోజుల్లో ఆరు గ్యారెంటీలను అమలు చేస్తామని మోసం చేసిన కాంగ్రెస్‌కు ఓటుతో బుద్ధి చెప్పాలని పిలుపునిచ్చారు. రాష్ట్రాభివృద్ధి జరుగాలంటే.. ఈ ప్రభుత్వానికి కనువిప్పు కలగాలంటే.. పార్లమెంట్‌లో తెలంగాణగొంతు వినబడాలంటే బీఆర్‌ఎస్ పార్టీని గెలిపించాలని ప్రజలు నిర్ణయించుకున్నారని చెప్పారు. శనివారం సిద్దిపేట జిల్లా గజ్వేల్‌లో బీఆర్‌ఎస్ మెదక్ ఎంపీ అభ్యర్థి వెంకట్రామిరెడ్డికి మద్దతుగా రోడ్ షోలో నిర్వహించి, సిద్దిపేటలోని తన నివాసంలో హరీశ్‌రావు మీడియాతో మాట్లాడారు. ఎన్నికలు ఉన్నా లేకున్నా ప్రజల మధ్యనే ఉంటూ ప్రజల కోసం కొట్లాడే బీఆర్‌ఎస్‌నే ఆశీర్వదించాలని కోరారు. కేసీఆర్ నిర్వహించిన రోడ్ షోలు ఉద్యమం నాటి రోజులను గుర్తు చేశాయని అన్నారు. ప్రజలు కేసీఆర్ సభకు ఎండలను సైతం లెక్కచేయకుండా నీరాజనం పట్టారని చెప్పారు. చెక్ బౌన్స్ అయితే శిక్ష పడ్డట్టు.. కాంగ్రెస్ బాండ్ పేపర్ బౌన్స్ కావడంతో శిక్ష వేయాలని ప్రజలు భావిస్తున్నారని చెప్పారు. తెలంగాణకు ఏమీ ఇవ్వని బీజేపీకి ఓటెందుకు వేయాలని ప్రజలు భావిస్తున్నారని తెలిపారు. కేసీఆర్ హయాంలో పుట్లకొద్దీ వడ్లు పండితే.. కాంగ్రెస్ హయాంలో రైతులకు పుట్టెడు కష్టాలు వచ్చాయని ఆవేదన వ్యక్తం చేశారు. బీఆర్‌ఎస్ పార్టీకి పూర్వ వైభవం రాబోతున్నదని, తెలంగాణ ప్రజలకు ఖచ్చితమైన గ్యారంటీ బీఆర్‌ఎస్ పార్టీయేఅని, కేసీఆర్ గ్యారంటీయే తెలంగాణ ప్రజలకు శ్రీరామరక్ష అని తెలిపారు. కేసీఆర్ ఉన్నపుడు రైతుల విలువ పెంచి.. రైతుల భూముల విలువ పెంచారని, కానీ నేడు కాంగ్రెస్ వచ్చాక రైతు విలువ తగ్గించి.. భూముల విలువ కూడా తగ్గించారని ఆగ్రహం వ్యక్తంచేశారు. ఇది కాంగ్రెస్‌కు, బీఆర్‌ఎస్‌కు ఉన్న తేడా అని చెప్పారు. తెలంగాణ ప్రజల కోసం ఆరు గ్యారెంటీలపై కాంగ్రెస్ ప్రభుత్వాన్ని నిలదీసిన కేసీఆర్‌ను ఇష్టమెచ్చినట్టు రేవంత్‌రెడ్డి తిట్లు తిట్టడం మర్యాదేనా? అని హరీశ్‌రావు ప్రశ్నించారు. జననేత కేసీఆర్‌ను తిట్టిన రేవంత్‌రెడ్డికి ఓటుతో బుద్ధిచెప్పాలని పిలుపునిచ్చారు. ఆయా కార్యక్రమాల్లో ఎమ్మెల్సీ డాక్టర్ యాదవరెడ్డి, ఎఫ్‌డీసీ మాజీ చైర్మన్ వంటేరు ప్రతాప్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్సీ ఫరూఖ్ హుస్సేన్, టీఎస్‌ఎంఎస్‌ఐడీసీ మాజీ చైర్మన్ ఎర్రోళ్ల శ్రీనివాస్, గజ్వేల్ ఏఎంసీ మాజీ చైర్మన్ మాదాసు శ్రీనివాస్, మున్సిపల్ చైర్మన్ రాజమౌళి, మున్సిపల్ చైర్మన్ మాజీ రాజనర్సు తదితరులు పాల్గొన్నారు.

సిద్దిపేట జిల్లా గజ్వేల్ రోడ్‌షోలో మాట్లాడుతున్న మాజీ మంత్రి తన్నీరు హరీశ్‌రావు. చిత్రంలో మెదక్ బీఆర్‌ఎస్ ఎంపీ అభ్యర్థి వెంకట్రామిరెడ్డి, ఎమ్మెల్సీ యాదవరెడ్డి, ఎఫ్‌డీసీ మాజీ చైర్మన్ వంటేరు ప్రతాప్‌రెడ్డి

మంచిర్యాల జిల్లా చెన్నూరులో నిర్వహించిన ప్రజా ఆశీర్వాద సభలో మాట్లాడుతున్న బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్. చిత్రంలో బీఆర్‌ఎస్ పెద్దపల్లి ఎంపీ అభ్యర్థి కొప్పుల ఈశ్వర్, సభకు హాజరైన జనం

మెజార్టీ సీట్లిస్తే ఢిల్లీ మెడలు వంచుతం

- **బీజేపీది విషపు పాలన.. కాంగ్రెస్‌ది అబద్ధాలమయం**
- **చెయ్యి, పువ్వు.. ఎన్నికల్లో ఏది గెలిచినాసింగరేణిని అమ్మేస్తరు**
- **హుజూరాబాద్, చెన్నూరు సభల్లో బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కే తారకరామారావు**

మంచిర్యాల, మే 11 (నమస్తే తెలంగాణ ప్రతినిధి)/హుజూరాబాద్: రాష్ట్రంలో మెజార్టీ ఎంపీ స్థానాల్లో బీఆర్‌ఎస్ అభ్యర్థులను గెలిపిస్తే జాతీయ పార్టీల మెడలు వంచి సింగరేణిని కాపాడుతామని బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ స్పష్టం చేశారు. శనివారం పెద్దపల్లి బీఆర్‌ఎస్ ఎంపీ అభ్యర్థి కొప్పుల ఈశ్వర్ విజయాన్ని కాంక్షిస్తూ మంచిర్యాల జిల్లా చెన్నూరులో నిర్వహించిన ప్రజా ఆశీర్వాద సభలో, కరీంనగర్ బీఆర్‌ఎస్ అభ్యర్థి బోయినపల్లి వినోద్‌కుమార్ గెలుపు కోరుతూ హుజూరాబాద్‌లో జరిగిన రోడ్ షోలో కేటీఆర్ పాల్గొని ప్రసంగించారు. అత్యధిక సీట్లలో బీఆర్‌ఎస్ గెలిస్తే ఆరు నెలల్లో మళ్లీ కేసీఆర్ రాష్ట్ర రాజకీయాలను శాసిస్తారని పునరుద్ఘాటించారు. కేసీఆర్ సీఎంగా ఉన్నప్పుడే బాగుండే అనుకునే వాళ్లంతా బీఆర్‌ఎస్‌కు ఓటేసి గెలిపించాలని పిలుపునిచ్చారు. కేంద్రంలో పదేండ్ల బీజేపీ పాలన విషంతో సమానమని, రాష్ట్రంలో 150 రోజుల కాంగ్రెస్ పాలన అబద్ధాలమయమని, పదేండ్ల కేసీఆర్ పాలనే నిజం అని బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ చెప్పారు. అరచేతిలో వైకుంఠం చూపిన రేవంత్‌రెడ్డిని, కాంగ్రెస్‌ను మరోసారి నమ్మి మోసపోవద్దని కోరారు. ఎంపీగా బండి సంజయ్ అమిత్ షా చెప్పులు మోసుడు తప్ప చేసిందేమీలేదని విమర్శించారు. ఈ ప్రాంతం కోసం కొట్లాడే వినోద్‌కుమార్‌ను గెలిపించాలని విజ్ఞప్తి చేశారు. సీఎం కుర్చీ పీఠం ఎక్కేందుకు రేవంత్‌రెడ్డి రైతు భరోసా, రుణమాఫీ, రూ.500 బోనస్, 2 లక్షల ఉద్యోగాలు, తులం బంగారం, స్కూటీలు, మహిళలకు రూ.2500, రూ.4 వేల పింఛన్ వంటి మస్తు ముచ్చట్లు చెప్పి, ఒక్కటైనా అమలు చేసిండా? అని ప్రశ్నించారు. హుజూరాబాద్ రోడ్‌షోలో ఎమ్మెల్యే పాడి కౌశిక్‌రెడ్డి, కరీంనగర్ జడ్పీ చైర్ పర్సన్ విజయ, మాజీ ఎమ్మెల్సీ నారదాసు లక్ష్మణ్, ఎస్సీ కార్పొరేషన్ మాజీ చైర్మన్ బండ శ్రీనివాస్, టూరిజం డెవలప్‌మెంట్ కార్పొరేషన్ మాజీ చైర్మన్ గెల్లు శ్రీనివాస్, మున్సిపల్ చైర్‌పర్సన్ రాధిక, పట్టణాధ్యక్షుడు శ్రీనివాస్ పాల్గొన్నారు. చెన్నూరులో పెద్దపల్లి బీఆర్‌ఎస్ ఎంపీ అభ్యర్థి ఈశ్వర్, మాజీ ఎమ్మెల్యేలు బాల్క సుమన్, దివాకర్‌రావు పాల్గొన్నారు.

హుజూరాబాద్ రోడ్ షోలో మాట్లాడుతున్న కేటీఆర్, చిత్రంలో కరీంనగర్ ఎంపీ అభ్యర్థి బోయినపల్లి వినోద్‌కుమార్, హుజూరాబాద్ ఎమ్మెల్యే పాడి తదితరులు

> “ ఈ ఎన్నికల్లో చెయ్యి గుర్తోడు గెలిచినా, పువ్వు గుర్తోడు గెలిచినా సింగరేణిని అదానీకి అమ్మేస్తరు.. జనవరిలోనే రేవంత్‌రెడ్డి స్విట్జర్లాండ్ పోయి ఒప్పందం చేసుకున్నడు.. దీనికి ప్రధాని మోదీ ఆశీస్సులు ఉన్నయి. ఆ ఇద్దరూ కలిసి సింగరేణిని అదానీకి రాసిచ్చే పనిలో ఉన్నరు. చెన్నూరు, మంచిర్యాల, బెల్లంపల్లి, రామగుండం, భూపాలపల్లి, కొత్తగూడెం, ఇల్లందులో ఉండే కార్మికులు ఈ విషయాన్ని యాదిపెట్టుకొని సింగరేణిని రక్షించే బీఆర్‌ఎస్‌కు ఓటెయ్యాలె. - కేటీఆర్

నా రాజీనామాను చెన్నూరులో పెట్టిపోత

ప్రధాని మోదీ పెట్రోల్, డీజిల్‌పై 34 శాతం పన్నులు వేసిండు.. ప్రతి వాహనదారుడి నుంచి పదేండ్లలో రూ.30 లక్షల కోట్లు వసూలు చేశారని కేటీఆర్ తెలిపారు. ఆ రూ.30 లక్షల కోట్ల నుంచే రూ.15 లక్షల కోట్లను అదానీకి, అంబానీకి రుణమాఫీ చేశారని విమర్శించారు. నేను చెప్పింది తప్పని బీజేపీ వాళ్లు రుజువు చేస్తే.. ఎమ్మెల్యే పదవికి రాజీనామా చేసి చెన్నూరులో పెట్టిపోతా.. అని కేటీఆర్ సవాల్ విసిరారు. నేను చెప్పింది అక్షర సత్యమని ఆయన స్పష్టం చేశారు.

మోదీజీ మీ గ్యారెంటీలు ఏమయ్యాయి?

గత ఎన్నికల్లో హామీ ఇచ్చిన ప్రధాని మోదీ గ్యారెంటీలు ఏమయ్యాయో తెలుసుకోవాలని దేశమనుకుంటున్నదని కేటీఆర్ తెలిపారు. మోదీ గ్యారెంటీ అనే బీజేపీ నినాదంపై శనివారం ఎక్స్ వేదికగా స్పందించారు. మోదీ హామీలకు సంబంధించిన న్యూస్ క్లిప్పింగ్స్ పోస్ట్ చేశారు. రైతుల ఆదాయం రెట్టింపు, యువతకు రెండు కోట్ల ఉద్యోగాలు, అర్హులైన ప్రతి ఒక్కరికీ ఇల్లు , ఐదు ట్రిలియన్ల ఎకానమీ , బుల్లెట్ ట్రైన్, ప్రతి ఒక్కరి అకౌంట్లో రూ.15 లక్షలు హామీలేమయ్యాయని ప్రశ్నించారు.

బీఆర్‌ఎస్ పార్లమెంటరీ పార్టీ నేతగా సురేశ్ రెడ్డి!

- **ఒకటి రెండు రోజుల్లో రాజ్యసభ చైర్మన్‌కు లేఖ**
- **ప్రకటించిన బీఆర్‌ఎస్ అధినేత**

హైదరాబాద్, మే 11 (నమస్తే తెలంగాణ): బీఆర్‌ఎస్ పార్లమెంటరీ పార్టీ నేతగా కేఆర్ సురేశ్‌రెడ్డిని నియమించనున్నట్టు అధ్యక్షుడు కేసీఆర్ తెలిపారు. ఒకటి రెండు రోజుల్లో రాజ్యసభ చైర్మన్‌కు లేఖ రాయనున్నట్టు ఆయన వెల్లడించారు. ఇప్పటి వరకు పార్లమెంటరీ పార్టీ నేతగా ఉన్న కేశవరావు పార్టీ వీడడంతో ఆ స్థానంలో కేఆర్ సురేశ్‌రెడ్డిని నియమించనున్నట్టు తెలంగాణ భవన్‌లో శనివారం జరిగిన మీడియా సమావేశంలో కేసీఆర్ స్పష్టం చేశారు. రాజ్యసభలో బీఆర్‌ఎస్‌కు ప్రస్తుతం సురేశ్‌రెడ్డి, దామోదర్‌రావు, పార్థసారథి, రవిచంద్ర సభ్యులుగా ఉన్నారు.

సమస్యలు పరిష్కరిస్తేనే ఓట్లేస్తాం

- **రోడ్డు, కల్వర్టు నిర్మాణానికి హామీ ఇవ్వాలని డిమాండ్**
- **లేదంటే ఎన్నికలను బహిష్కరిస్తాం**
- **ప్లకార్డులతో నిరసన తెలిపిన అచ్యుతాపురం గ్రామస్థులు**

దుమ్ముగూడెం, మే 11: తమ గ్రామంలో ఏండ్ల తరబడి పెండింగ్‌లో ఉన్న సమస్యలు పరిష్కరిస్తేనే ఈ పార్లమెంట్ ఎన్నికల్లో ఓట్లు వేస్తామని, లేదంటే ఎన్నికలను బహిష్కరిస్తామని భద్రాద్రి కొత్తగూడెం జిల్లా దుమ్ముగూడెం మండలం అచ్యుతాపురం గ్రామస్థులు తేల్చిచెప్పారు. ఈ మేరకు శనివారం గ్రామంలో ప్లకార్డులతో నిరసన తెలిపారు. ఈ సందర్భంగా పలువురు గ్రామస్థులు మాట్లాడుతూ.. ఇదే మండలంలోని లక్ష్మీనగరం గ్రామం నుంచి అచ్యుతాపురం వరకు జడ్పీ రోడ్డు నిర్మాణం ఎన్నో ఏండ్లుగా పెండింగ్‌లో ఉన్నదని, గ్రామంలో ఉన్న కల్వర్టు కుంగిపోయిందని తెలిపారు. దీనిపై సంబంధిత శాఖల అధికారులు, ప్రజాప్రతినిధులకు ఎన్నిసార్లు విన్నివించినా ఎవరూ పట్టించుకోలేదని, ఈసారి పట్టించుకోకపోతే ఎన్నికలను బహిష్కరిస్తామని స్పష్టంచేశారు. ఈ మేరకు గ్రామస్థులందరూ కలిసి తీర్మానం చేసినట్టు చెప్పారు. లక్ష్మీనగరంలోని రేగుబల్లి ఆశ్రమ పాఠశాల నుంచి వస్తున్న మురుగునీరు నేరుగా చెరువులో కలుస్తుండటం వల్ల అంటువ్యాధులు ప్రబలుతున్నాయని, ఈ సమస్యను కూడా పరిష్కరించాలని డిమాండ్ చేశారు. నిరసన తెలిపిన వారిలో అచ్యుతాపురం గ్రామస్థులు, ప్రజాప్రతినిధులు ఉన్నారు.

కాంగ్రెస్‌ను ప్రజలు నమ్మడం లేదు

- **ఆరు గ్యారెంటీలు అమలుచేయక క్రెడిబిలిటీ కోల్పోయింది**
- **రాహుల్, రేవంత్ కూడబలుక్కొని హామీలపై అబద్ధాలు చెప్తున్నరు**
- **కాంగ్రెస్, బీజేపీ కంటే బీఆర్‌ఎస్ మెరుగైన ఎంపీ సీట్లు సాధిస్తది**
- **'నమస్తే తెలంగాణ'తో మాజీ మంత్రి, ఎమ్మెల్యే హరీశ్‌రావు**

సిద్దిపేట, మే 11 (నమస్తే తెలంగాణ ప్రతినిధి): 'రాష్ట్రంలో కాంగ్రెస్ సర్కారు వంద రోజుల్లో ఆరు గ్యారెంటీలు అమలుచేయకుండా ప్రజలను మోసగించింది. కొత్త పథకాలు అమలుకాకపోగా.. ఉన్న పథకాలు ప్రజలకు అందకుండా పోతున్నాయి. గ్యారెంటీలకే దిక్కు లేదు. కొత్తగా ఇచ్చే హామీలను ఎలా నమ్ముతారు' అని మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే హరీశ్‌రావు ప్రశ్నించారు. పార్లమెంట్ ఎన్నికల్లో కాంగ్రెస్, బీజేపీ కంటే మెరుగైన సీట్లు బీఆర్‌ఎస్ సాధిస్తుందని ధీమా వ్యక్తం చేశారు. కేసీఆర్ బస్సుయాత్ర విజయవంతమైందని పేర్కొన్నారు. రాష్ట్రంలో ఏం జరుగుతుందో రాహుల్‌గాంధీకి అవగాహన లేదని, రేవంత్‌రెడ్డి ఏది రాసిస్తే దానిని చదువుతున్నారని విమర్శించారు. పలు అంశాలపై హరీశ్‌రావు 'నమస్తే తెలంగాణ'తో ప్రత్యేకంగా మాట్లాడారు. ఆయన మాటల్లోనే..

కాంగ్రెస్ పార్టీ ఉదయ్‌పూర్ డిక్లరేషన్‌కు కట్టుబడి ఉన్నదా?

ఉదయ్‌పూర్ డిక్లరేషన్‌లో ప్యారాచూట్ నేతలను తిరిగి పార్టీలోకి తీసుకోబోమని కాంగ్రెస్ స్పష్టంగా చెప్పింది. కానీ, రాష్ట్రంలో ప్యారాచూట్ నేతలకే పెద్దపీట వేశారు. మెదక్‌లో నీలం మధు, వరంగల్‌లో కడియం కావ్య, మల్కాజిగిరిలో సునీతామహేందర్ రెడ్డి, చేవెళ్లలో రంజిత్‌రెడ్డి వీళ్లంతా ప్యారాచూట్ నేతలు. కరీంనగర్, ఖమ్మం, ఆదిలాబాద్‌లో కొత్త వారిని తీసుకొచ్చారు. అసలైన కాంగ్రెస్ నాయకులు బాధపడుతున్నారు. పార్టీ కోసం కష్టపడిన వారికి మోసం జరిగిందని కోపంగా ఉన్నారు. మెదక్‌లో టికెట్ పొందిన వ్యక్తి గతంలో కాంగ్రెస్ జెండాలు తగలబెట్టాడు. జనాభా ప్రాతిపాదికన రిజర్వేషన్లు, టికెట్లు ఇస్తామని చెప్పారు. పార్లమెంట్ ఎన్నికల్లో ఎంతమంది బీసీలకు టికెట్లు ఇచ్చారు? బీఆర్‌ఎస్ ఐదుగురికి ఇచ్చి న్యాయం చేసింది.

గ్యారెంటీలు అమలుచేశామని చెప్తున్నది?

వంద రోజుల్లోనే ఆరు గ్యారెంటీలు అమలు చేయించే బాధ్యత నాది అని రాహుల్‌గాంధీ గత అసెంబ్లీ ఎన్నికల ముందు చెప్పారు. 150 రోజులు అవుతున్నా ఒక్క రోజు రివ్యూ చేయలేదు. పార్లమెంట్ ఎన్నికల ముందు వచ్చి కొత్త హామీలు ఇస్తున్నారు. ఇచ్చిన గ్యారెంటీలకే దిక్కు లేదు. కొత్త హామీలను తెలంగాణ ప్రజలు ఎలా నమ్ముతారు? నిర్మల్ సభలో రాహుల్ మాట్లాడుతూ మహిళలకు 2,500 ఇచ్చామని అంటాడు.. ఆరు గ్యారెంటీలు అమలు చేశామని చెప్తాడు. రేవంత్‌రెడ్డి ఏది రాసిస్తే దానిని చదివిపోతున్నారు. ఫలితంగా రాహుల్‌గాంధీ అభాసుపాలయ్యారు. రాహుల్‌గాంధీ తప్పు మాట్లాడితే ప్రజలకు క్షమాపణ చెప్పాలి. రేవంత్‌రెడ్డి సమక్షంలో రాహుల్‌అబద్ధాలు చెప్పారు. 2,500 ఇవ్వలేదని రేవంత్ రెడ్డి చెప్పాలి కదా..? అంటే ఇద్దరు కూడబలుక్కొని అవాస్తవాలు చెప్తున్నారు.

ఉద్యోగాలు ఇచ్చామని రేవంత్‌రెడ్డి చెప్తున్నారు..మీరేమంటారు...?

రేవంత్‌రెడ్డిది దుష్ప్రచారం. ఇచ్చిన 30 వేల ఉద్యోగాల్లో ఒక్క నోటిఫికేషనన్న ఇచ్చారా..? ఒక్కదానికైన పరీక్ష పెట్టారా.. ? నోటిఫికేషన్ ఇచ్చింది.. పరీక్ష పెట్టింది.. ఫలితాలు ఇచ్చింది.. సర్టిఫికెట్లు వెరిఫై చేసింది బీఆర్‌ఎస్ ప్రభుత్వమే..రేవంత్‌రెడ్డి కేవలం ఆర్డర్ కాపీనే ఇచ్చావ్. ఎనుకటికి అంత వంట వండి పెట్టినంక ఎవడో వడ్డించడానికి వచ్చి అంతా నేనే చేసిన అన్నాడట. నిరుద్యోగ భృతి ఇస్తా అని నిండు అసెంబ్లీలో చెప్పినవు.. నిరుద్యోగభృతి ఇస్తామని హామీ ఇవ్వలేదు అని స్వయంగా డిప్యూటీ సీఎం ఆర్థిక మంత్రి చేతులేత్తేసిండు.

అన్నివర్గాలకు సమన్యాయమంటున్నది?

గ్రామ పంచాయతీ వర్కర్లకు నాలుగు నెలలుగా వేతనాలు లేవు. పల్లె ప్రగతి అటకెక్కింది. పట్టణ ప్రగతి మూలకు పడింది. అన్ని వర్గాలను కాంగ్రెస్ మోసం చేసింది. ఉద్యోగులకు నాలుగు డీఏలు పెండింగ్‌లో పెట్టింది. అధికారంలోకి రాగానే పెండింగ్‌లో ఉన్న మూడు డీఏలు రేపే ఇస్తామని రేవంత్‌రెడ్డి ఉద్యోగ సంఘాలతో మీటింగ్ పెట్టి చెప్పి ఇంత వరకు ఇయ్యలేదు. రైతు బంధు అడిగితే చెప్పుతో కొడతామంటుండ్రు. గాలిలో ఉన్న నాయకులను భూమి మీదికి తేవాలంటే పార్లమెంట్ ఎన్నికల్లో ఆ పార్టీని ఓడించాలి.

రాష్ట్రంలో కాంగ్రెస్ పాలన ఎలా ఉన్నది?

కాంగ్రెస్ ప్రభుత్వం రివర్స్ గేర్‌లో నడుస్తున్నది. వ్యవసాయానికి 24 గంటల కరెంట్ నుంచి 18 గంటలకు వచ్చింది. వ్యవసాయ మోటర్లు కాలుతున్నాయి. పంటలు ఎండిపోతున్నాయి. కేసీఆర్ కిట్టు, న్యూట్రిషన్ కిట్టు బంద్. కల్యాణలక్ష్మి, షాదీముబారక్ చెక్కులు ఆలస్యం.. రైతులు, చేనేత కార్మికులు, ఆటో కార్మికుల ఆత్మహత్యలు నిత్యకృత్యమయ్యాయి. కేసీఆర్ హయాంలో సకాలంలో రైతుబంధు వచ్చింది. ఇప్పుడు ఎందుకు ఆలస్యం అవుతున్నది..? సకాలంలో వడ్లు కొనక దళారులకు రూ.1,900కు రైతులు అమ్ముకుంటున్నారు. వడ్లకు తరుగు పెట్టిన కాంగ్రెస్‌కు ఓట్లల్లో తరుగు పెట్టాలి .

ప్రతిపక్ష నాయకులపై ప్రతీకారం..

కాంగ్రెస్ ప్రభుత్వం గీత కార్మికుల ఉసురు పోసుకుంటుంది. చంచల్‌గూడ జైలులో ఒక బ్యారెక్ నిండా గీత కార్మికులే ఉన్నారు. కేసీఆర్ హయాంలో గీత కార్మికుల మీద ఒక్క కేసు లేదు. 450 మందికిపైగా ఆర్‌ఎంపీలను జైళ్లల్లో పెట్టిన్రు. రైస్‌మిల్లులపై దాడులు చేస్తున్నరు. వ్యాపారస్తులు, వైశ్యుల మీద తూనికల కొలతల అధికారులు దాడులు చేస్తున్నరు. పొల్యూషన్ కంట్రోల్ బోర్డు అధికారులు కంపెనీలను, పారిశ్రామికవేత్తలను భయపెట్టించి వసూళ్లకు పాల్పడుతున్నరు. ప్రతిపక్ష నాయకులమీద ప్రతీకారం తీర్చుకుంటున్నరు.

బీజేపీ రాయాలయం కట్టించాం.. అని ఓట్లు అడుగుతున్నది.. మీరేమంటారు.

బీజేపీకి నలుగురు ఎంపీలు గెలిచినా, కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి ఉన్నా.. తెలంగాణకు వీళ్లు తెచ్చింది గుండు సున్న. వాళ్లు గెలిచినా చేసేదేమీ లేదు. 28 రాష్ర్టాల్లో ఏ ముఖ్యమంత్రీ కేసీఆర్ లాగా వెయ్యి కోట్లతో అద్భుతమైన యాదాద్రి ఆలయం కట్టియ్యలేదు. శతచండీ హోమం చేసిండు. రామాలయాన్ని ట్రస్టు కట్టింది. బీజేపీ కట్టలే. బీజేపీ కార్పొరేట్లకు 14 లక్షల కోట్లు మాఫీ చేస్తే, కర్షకులకు నయాపైసా మాఫీ చేయలేదు. పేదల ప్రయోజనాలకు విరుద్ధగా పనిచేసే పార్టీ బీజేపీ.

కాంగ్రెస్ హయాంలో రియల్‌ఎస్టేట్ స్థితి

కాంగ్రెస్ వచ్చినంక రియల్ ఎస్టేట్ కుదేలైపోయి లక్షల మంది ఏజెంట్ల జీవితాలు రోడ్డున పడ్డాయి. రేవంత్‌రెడ్డి గత ప్రభుత్వం మీద బురదజల్లాలనే ఉద్దేశంతో లేని అప్పులను చూపించి రాష్ర్టాన్ని దివాళా తీయిస్తున్నడు. రాష్ర్టానికి పెట్టుబడులు రాకుండా పోయాయి. ఉద్యోగాల కల్పన ఆగిపోయింది. రియల్ ఎస్టేట్ ఏజెంట్లు ఆత్మహత్యలు చేసుకొనే పరిస్థితి వచ్చింది. చేనేత కార్మికులకు రూ.350 కోట్ల పెండింగ్ ఉంది. సిరిసిల్లలో ఆత్మహత్యలు మొదలైనవి. హైండ్లూమ్ వర్కర్స్ పేమెంట్ ఆగిపోయినయ్. పాలుపోసే రైతులకు మూడు నెలలుగా బిల్లులు వస్తలేవు. కేసీఆర్ ఉన్నప్పుడు వారం వారం వచ్చేది.

బీఆర్‌ఎస్ పార్టీకి ఎన్ని స్థానాలు రావొచ్చు?

కాంగ్రెస్, బీజేపీల కంటే మెరుగైన సీట్లు బీఆర్‌ఎస్ సాధిస్తుంది. కేసీఆర్ పర్యటన విజయవంతమైంది. రాహుల్‌గాంధీ సభ జనం లేక వెలవెలబోయింది. జనం కోసం 45 నిమిషాలు బస్సులో రాహుల్‌గాంధీ బ్రేక్ చేసిండు. రేవంత్‌రెడ్డి రోడ్డు మీదికి వచ్చి జనాన్ని లోపలికి రండి అంటూ బతిలాడుకున్నడు. చివరికి 10 నిమిషాలు మాట్లాడి వెళ్లిపోయిండు. చేవెళ్ల, మల్కాజిగిరి, సికింద్రాబాద్ మూడు పార్లమెంట్లు కలిపితే కూడా 3 వేల మంది రాలె. ప్రజలు కాంగ్రెస్‌ను తిరస్కరిస్తున్నారనడానికి రాహుల్ సభే నిదర్శనం. బీజేపీ రాష్ర్టానికి ఒక్క జాతీయ ప్రాజెక్టు, మెడికల్ కాలేజ్, నర్సింగ్ కాలేజ్ కూడా ఇయ్యలేదు. ఈ రాష్ర్టానికి విభజన హామీలు అమలు చేయలేదు. అడుగడుగునా రాష్ర్టానికి అన్యాయం చేసిన బీజేపీకి గుణపాఠం చెప్పాలని ప్రజలు అనుకుంటున్నరు. అందువల్ల ఖచ్చితంగా ఈ సారి బీఆర్‌ఎస్ పార్టీ శాసన సభ ఎన్నికల కంటే కూడా మెరుగైన ఫలితాలు సాధిస్తుందని నమ్మకం ఉన్నది. కేసీఆర్ బస్సు యాత్రకు ప్రజాదరణనే మేము మెరుగైన ఫలితాలు సాధిస్తామనడానికి నిదర్శనం.

మీ సవాల్‌ను రేవంత్‌రెడ్డి స్వీకరించలేదు కదా...?

రేవంత్‌రెడ్డి నా సవాల్ స్వీకరించడం లేదు. వందరోజుల్లో అమలు చేస్తానన్న 6 గ్యారెంటీలు, 2 లక్షల రుణమాఫీ ఇవన్నీ పంద్రాగస్టులోగా చేస్తే నేను రాజీనామాకు సిద్ధమన్న. అసలు నువ్వు దానికి సిద్ధమా? కాదా? నువ్వు ఇంత వరకు ముందుకు రాలేదు. నువ్వు రాజీనామా పత్రం పెట్టు.. నేను పెడుత.. అంటే పెట్టలేదు.. అంటే నా సవాల్ స్వీకరించనే లేదు. దేవుళ్ల మీద ఓట్లు పెట్టి ప్రజలను మభ్యపెట్టెడెందుకు.. ఇద్దరం రాజీనామాలు పెడుదామని నేను సవాల్ విసిరిన. ఆ సవాల్ నువ్వు స్వీకరించినవా లేదా..? నువ్వు స్వీకరించలేదు అంటే ఆగస్టు 15లోగా 6 గ్యారెంటీలు, రుణమాఫీ చెయ్యవు అని ప్రజలు అర్థం చేసుకుంటున్నరు.

రోడ్లకు నిధులు తక్కువ.. వసూళ్లు ఎక్కువ

- **రాష్ట్రంలో జాతీయ రహదారుల అభివృద్ధికి కేంద్రం ఖర్చు చేసింది రూ.20 వేల కోట్లే**
- **దీని కంటే టోల్, రోడ్ సెస్సే అధికం**
- **రూ.1.25 లక్షల కోట్లు ఇచ్చినట్టు గొప్పలు చెప్తున్న మోదీ సర్కారు**

హైదరాబాద్, మే 11 (నమస్తే తెలంగాణ): రాష్ట్రంలో జాతీయ రహదారుల అభివృద్ధికి మోదీ సర్కారు ఇచ్చింది శూన్యమనే చెప్పవచ్చు. తెలంగాణకు తొమ్మిదేండ్లలో రూ.1.25 లక్షల కోట్ల విలువైన జాతీయ రహదారులు మంజూరు చేసిన కేంద్రం.. ఖర్చు చేసింది మాత్రం రూ.20 వేల కోట్లే. ఇదే సమయంలో రాష్ట్రంలోని వాహనదారుల నుంచి టోల్ రూపంలో రూ.9 వేల కోట్లకుపైగా వసూలు చేసింది. పెట్రోలు, డీజిల్ అమ్మకాల ద్వారా వసూలు చేసిన రోడ్డు సెస్సు దీనికి అదనం. కొత్త జాతీయ రహదారుల ఏర్పాటు, రాష్ట్ర రహదారులను జాతీయ రహదారులుగా అప్‌గ్రేడ్ చేయడం లాంటి పనులను కేంద్ర రోడ్డు రవాణా, రహదారుల మంత్రిత్వశాఖ చేపడుతుంది. గతంలో కేసీఆర్ ప్రభుత్వం తెలంగాణలో ప్రధాన ప్రాంతాలను కలిపే 14 స్టేట్ రోడ్లను జాతీయ రహదారులుగా గుర్తించి, నాలుగు లేన్లుగా అభివృద్ధి చేయాలని ప్రతిపాదనలు, డీపీఆర్ సమర్పించింది. మోదీ సర్కారు అవసరమనుకున్న రహదారులకే అనుమతులు మంజూరు చేసింది. తొమ్మిదేండ్లలో రూ.1.25 లక్షల కోట్ల విలువైన పనులు మంజూరు చేసి, అందులో రూ.20 వేల కోట్లు మాత్రమే ఖర్చు చేయడం తెలంగాణ పట్ల మోదీ సర్కారు వివక్షను స్పష్టం చేస్తున్నది.

కేంద్రం ఖజానా నుంచి ఇచ్చేది శూన్యం

వాస్తవానికి కేంద్రం జాతీయ రహదారుల అభివృద్ధికి తమ ఖజానా నుంచి ఖర్చుచేసేది శూన్యమే. రోడ్ల నిర్మాణ పనులు నిర్వహించే ఏజెన్సీలే టోల్ ట్యాక్స్ రూపంలో వాహనదారుల నుంచి సొమ్ము వసూలు చేసుకుంటాయి. కేంద్రం రోడ్ సెస్సు రూపంలో పెట్రోల్, డీజిల్‌పై ప్రతి లీటర్‌కు రూ.30 చొప్పున ఏటా రాష్ట్రం నుంచి రూ.వేల కోట్లు వసూలు చేస్తున్నది. రాష్ర్టాల నుంచి సాలీనా రూ.5 లక్షల కోట్లు పిండుకుంటున్నది. దీన్ని బట్టే కేంద్రం తెలంగాణ నుంచి ఎన్ని నిధులు వసూలు చేసిందో, రాష్ట్రంలో రహదారుల అభివృద్ధికి ఎంతిచ్చిందో అర్థం చేసుకోవచ్చు.

జాతీయ రహదాల అభివృద్ధి వివరాలు

- ప్రస్తుతం రాష్ట్రంలో 30 జాతీయ రహదారులు 4,983 కిలోమీటర్ల మేర విస్తరించి ఉన్నాయి. వీటిలో 2,682 కి.మీ. రోడ్లు కేంద్రం నియంత్రణలో, 2,301 కి.మీ. ఆర్అండ్‌బీ నియంత్రణలో ఉన్నాయి.
- గత తొమ్మిదేండ్లలో తెలంగాణకు కేంద్ర రోడ్డు రవాణా, రహదారుల మంత్రిత్వ శాఖ రూ.1,21,862 కోట్ల విలువైన 113 ప్రాజెక్టులను మంజూరు చేసింది.
- వీటిలో రూ.22,492 కోట్ల విలువైన 87 ప్రాజెక్టులు రాష్ట్ర ఆర్అండ్‌బీ పరిధిలో, రూ.99,370 కోట్ల విలువైన 26 ప్రాజెక్టులు ఎన్‌హెచ్ఏఐ పరిధిలో ఉన్నాయి.
- ఇవికాకుండా సీఆర్ఐఎఫ్ కింద కేంద్రం తొమ్మిదేండ్లలో తెలంగాణకు రూ.3,314 కోట్ల విలువైన 245 పనులు మంజూరు చేసింది. ఖర్చు రూ.2,021 కోట్లే.
- రాష్ట్ర ఆర్అండ్‌బీ పరిధిలోని జాతీయ రహదారులు, కేంద్రం పరిధిలోని జాతీయ రహదారులు, సీఆర్ఐఎఫ్ నిధులు కలిపి తొమ్మిదేండ్లలో తెలంగాణకు రూ.1.25 లక్షల కోట్లు మంజూరు చేసిన కేంద్రం.. అందులో రూ.20,351 కోట్లు మాత్రమే విడుదల చేసింది.
- సీఆర్ఐఎఫ్ కింద చేపట్టే పనులకు కేంద్రం మంజూరు చేసిన నిధుల కంటే రాష్ట్ర ప్రభుత్వం అధికంగా నిధులు ఖర్చు చేస్తుండటం గమనార్హం. సీఆర్ఐఎఫ్ నిధుల కోటా పెంచాలని కేసీఆర్ కేంద్రానికి విజ్ఞప్తి చేసినా ఫలితం లేకపోయింది.
- రాష్ట్రంలోని 1,612 కిలోమీటర్ల రోడ్లపై 32 టోల్‌ప్లాజాల ద్వారా కేంద్రం రూ.9 వేల కోట్లు వసూలు చేసింది.
- రాష్ట్రంలో జాతీయ రహదారుల అభివృద్ధికి కేంద్రం ఖర్చు చేసిన రూ.20,351 కోట్ల నుంచి రూ.9 వేల కోట్ల టోల్ వసూళ్లను మినహాయిస్తే మోదీ సర్కారు రూ.11,351 కోట్లు మాత్రమే వెచ్చించినట్టు లెక్క. రాష్ట్రంలో వసూలు చేసిన రోడ్ సెస్సును కూడా మినహాయిస్తే తెలంగాణలో రహదారుల అభివృద్ధికి కేంద్రం చేసిన ఖర్చు శూన్యమనే చెప్పవచ్చు.